క్లుప్తంగా

శనైశ్చరుడికి పూజలు



ఏన్కతలలో స్వామి వారి అభిషేకంలో భక్తులు

మోమిన్‌పేట: శనైశ్చర స్వామి జయంతి సందర్భంగా మంగళవారం ఏన్కతలలోని శనైశ్చర స్వామిని భక్తులు తైలాభిషేకంతో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారి దర్శనానికి క్యూ కట్టారు. స్వామి వారి దర్శనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, ఈఓ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు



అర్కతలలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న విజయ్‌కుమార్

నవాబుపేట: మండల పరిధిలోని అర్కతల గ్రామంలో మంగళవారం 20 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎంపీఓ విజయ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమ, గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, రాములు, శివాని, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలారి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిందే



గోగ్యానాయక్ తండాలో తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

కుల్కచర్ల: తడిసిన ధాన్యాన్ని రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయాల్సిందేనని కుల్కచర్ల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాందాస్ నాయక్, చౌడాపూర్ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సత్తినేని సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోగ్యానాయక్ తండాలో వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వర్షాలకు తడిసి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు జుబేర్, మాజీ సర్పంచ్ రవి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రేణుక ఎల్లమ్మ జాతర



బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

తాండూరు రూరల్: కోత్లాపూర్ గ్రామ శివారులోని శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర కొనసాగుతుంది. మంగళవారం అమ్మ వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు తాండూరుతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ నెల 30వ తేదీన రథోత్సవం, సిడే ఊరేగింపు నిర్వహిస్తారని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఈవో శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కల్పన, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు

- వ్యవసాయాధికారుల సూచనలతో అధిక లాభాలు
- మే చివరి వరకు సాంపుల్స్ సేకరణ
- జూన్ మొదటి వారంలో ఫలితాల అందజేత
- రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జ్యోతి
వ్యవసాయాధికారి



ఎల్లకొండలో భూసార పరీక్షల కోసం మట్టిని సేకరిస్తున్న అధికారులు

నవాబుపేట: భూసార పరీక్షలతో రైతులకు ఆశించిన స్థాయిలో లాభాలు పొందొచ్చు. విచక్షణా రహితంగా పొలాల్లో బస్తాల కొద్దీ రసాయన ఎరువులు, మందులు వాడటంతో పంటకు నష్టమే తప్ప ఫలితాలు సానుకూలంగా రావని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అధికారులు చేయించే భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పంటలు వేసుకుంటే మేలు కలుగుతుందని చెబుతున్నారు. ఈ నెల చివరి వరకు సాంపుల్స్ సేకరిస్తామని, జూన్ మొదటి వారం వరకు ఫలితాలు అందజేస్తామని మండల వ్యవసాయాధికారి జ్యోతి తెలిపారు. మండలంలో ఖరీఫ్‌లో సాగు చేయనున్న భూమి 27,234 ఎకరాలు. అందులో ఇప్పటి వరకు 400లకు పైగా సాంపుల్స్ సేకరించామని, ఇంకా ఆసక్తి ఉన్న రైతులు పరీక్షలు చేయించుకోవచ్చని, అవసరమైన వారికీ ఏఈఓలు వచ్చి పొలాల్లో తీసుకుంటారన్నారు. భూ సార పరీక్షలతో రైతులకు కలిగే ప్రయోజనాన్ని, రైతులు పాటించాల్సిన నియమాలను అందుకు సంబంధించిన వివరాలను వ్యవసాయ అధికారి జ్యోతి వెల్లడించారు.

ఎరువుల ఖర్చు తగ్గించొచ్చు

- పంటకు ఏఏ ఎరువులు, ఎలాంటివి వేయాలి, ఎంత మోతాదులో వేయొచ్చో తెలుసుకోవచ్చు.
- భూసార పరీక్షల అనంతరం ఆ నేలకు కావలసిన ఎరువుల మోతాదును సిఫారసు చేస్తారు.
- భూముల్లో సహజంగా ఉండే ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాల స్థాయిని తెలుసుకోవచ్చు.

అధిక దిగుబడి కోసమే

- రైతులు అధిక దిగుబడి కోసం పోటీ పడి మరీ ఎరువులు వేస్తున్నారు. నష్టాల్ని కొని తెచ్చుకుంటున్నారు.
- అధిక ఎరువుల వాడకంతో భూ సారం దెబ్బతింటుంది.
- పోషక లోపాల్ని గుర్తించకపోతే ఇబ్బందులు తప్పవు.
- గత సీజన్‌లో వేసిన పంటలనే మళ్లీ వేయడంతో సారం దెబ్బతిని దిగుబడి తగ్గుతుంది.

నమూనాల సేకరణ..

- సాగు భూముల తీరును బట్టి నమూనాలు సేకరించాలి.
- భూమి ఎత్తుపల్లాలు, నేల స్వభావంలో తేడా ఉంటే విస్తీర్ణంతో సంబంధం లేకుండానే అన్ని చోట్ల నుంచి వేర్వేరు నమూనాలు సేకరించాలి.
- ఇంగ్లీష్ 'వి' ఆకారంలో 15 సెంటీమీర్ల లోతులో గుంత తీసి, అందులోనుంచి కింది పార వరకు ఒక పక్కగా మట్టి సేకరించాలి
- ఎకరం విస్తీర్ణంలో 8 చోట్ల నుంచి మట్టిని తీసుకొని ఒక దగ్గర చేర్చాలి.

ఆ మట్టిని బాగా కలిపి నాలుగు భాగాలు చేయాలి. ఎదుటి భాగం మట్టిని తీసుకొని మిగిలిన భాగాన్ని తీసివేయాలి. అరకిలో మేరకు మట్టి వచ్చేంత వరకు అలా చేయాలి. మట్టిని కలిపేందుకు రసాయన ఎరువుల సంచుల్ని వాడొద్దు. ప్లాస్టిక్ సీట్లను ఉపయోగించాలి. నేల వాలు, మట్టి రంగులో తేడా లేనప్పుడు ప్రతి ఐదు ఎకరాలకు ఒక నమూనా తీస్తే సరిపోతుంది.

ఏఏ నేలల్లో సేకరించొద్దు

- చెట్ల కింది, గట్ల పక్కన, కంచెల దగ్గర, ఎరువుల కుప్పల వద్ద, కాలి నడక బాటలో మట్టి నమూనాల్ని తీయొద్దు.
- బాగా సారవంతమైన నేల, మరీ నిస్సారంగా ఉండే ప్రాంతం నుంచి తీసిన మట్టిని కలపొద్దు.
- చౌడు భూమి అయితే విడిగా నమూనాలు సేకరించాలి.

సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు

- నమూనాలు సేకరించే టప్పుడు నేలపైన ఆకులు, చెత్తాచెదారాన్ని తీసివేయాలి.
- సేకరించిన మట్టిలో రాళ్లు, పంట వేర్లు లేకుండా చూసుకోవాలి.
- నీరు నిలిచిన బురద నేల నుంచి నమూనాలు తీయొద్దు. ఒక వేళ తప్పని సరైతే మట్టిని నీడలో ఆరబెట్టి ఆతర్వాతే పరీక్షలకు పంపాలి.
- మెట్ట భూములు, ఆరుతడి పంటలు, పంట పెరుగుతున్న సమయంలో నమూనాల్ని తీయాల్సి వస్తే, వరుసల మధ్య నుంచి సేకరించాలి.
- పొలంలో అక్కడక్కడా చౌడుగా ఉన్నట్లు అనుమానం కలిగితే అక్కడ నుంచి ప్రత్యేకంగా 15 సెంటీ మీటర్లు, 30 సెంటీ మీటర్ల లోతులో వేర్వేరుగా రెండు నమూనాలను సేకరించాలి.
- భూమిలోని పోషకాల్ని మొక్కలకు ఏ మేరకు అందించవచ్చో దానిని బట్టే తెలుస్తుంది. దిగుబడి కూడా ఆధారపడి ఉంటాయి.
- పోషకాలు ఎక్కువైనా, తక్కువైనా ఆశించిన స్థాయిలో దిగుబడి రాదు.
- సాధారణంగా భాస్వరం, పొటాష్ సిఫారస్సు చేసిన ఎరువులు మోతాదు కన్నా తక్కువగానూ, నత్రజనిని భాగా ఎక్కువగానూ వాడటం వల్లే అనర్థం.
- విచక్షణారహితంగా రసాయనాల వాడకంతో పోషకాల సమతుల్యత దెబ్బతింటుంది.
- నత్రజని ఎరువును అధికంగా వాడటంతో పంట విపరీతంగా ఎదిగి పడిపోతుంది.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మండల వ్యవసాయాధికారి జయశంకర్



మోమిన్‌పేట రైతు వేదికలో రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఈఓలు

మోమిన్‌పేట: రైతులు ఏఈఓల వద్ద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జయశంకర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతుల వివరాల నమోదును ప్రారంభించారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ నంబరు, ఫోన్ నంబర్‌ను లింక్ చేస్తారన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వల్ల ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులను ఎంత వరకు ఉపయోగిస్తున్నారనే విషయాలు ప్రభుత్వానికి తెలుస్తుందని జయశంకర్ వివరించారు. ఇప్పటికే ఎరువులు కొనుగోలు చేసినప్పుడు ఆధార్ నంబర్‌ను లింక్ చేస్తున్నారని ఇకమిదట విత్తనాల కొనుగోలులో కూడా లింక్ చేయనున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రీనివాస్, పెంటయ్య, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో..

నవాబుపేట: రైతులు తప్పనిసరిగా వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతు కార్డు పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపడుతుందన్నారు. కావున రైతులు పాసుబుక్, ఆధార్ కార్డు తీసుకెళ్లి ఏఈఓల వద్ద ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఆదిల్, రమాదేవి, గ్రామాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: రైతులందరు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ కోట్‌పల్లి ఎఓ కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోకుంటే పీఎం కిసాన్, సబ్సిడీ ఎరువులు, పంట దిగుబడి, కొనుగోళ్లు, మద్దతు ధర పంట రుణాలు నిలిపివేస్తారని పేర్కొన్నారు.

టీబీ నివారణకు కృషి



చాపలగూడెం గ్రామంలో టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కుల్కచర్ల: టీబీ(క్షయ) నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి కిరణ్ గౌడ్ పేర్కొన్నారు. టీబీ ముక్త అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చాపలగూడెం గ్రామంలో టీబీపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దగ్గు, ఛాతినొప్పి, జ్వరం, ఆకస్మికంగా బరువు తగ్గటం వంటి లక్షణాలు వచ్చిన వెంటనే వ్యాధి పరీక్షలను చేయించుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పరిధిలో నిర్వహించే వైద్య పరీక్షలలో ఎవరికైనా వ్యాధి గుర్తించబడితే అవసరమైన నివారణ చికిత్సలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోటీబీ అసిస్టెంట్ రాజు, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ సాయప్ప, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీని విజయవంతం చేయండి

నందిగామ: షాద్‌నగర్‌లో బుధవారం నిర్వహించనున్న తిరంగా ర్యాలీకి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి పార్టీలకతీతంగా నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ విజయ ర్యాలీ, భారత సాయుధ దళాలకు గౌరవ వందనం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 4.30 గంటలకు షాద్‌నగర్ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం నుంచి కన్యకాపరమేశ్వరి దేవాలయం వరకు ర్యాలీ చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్ రూరల్: శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో అభయాంజనేయ స్వామివారి ఆలయ సమీపంలోని అక్షర హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు భజన మండలి సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లో నానక్‌రామ్‌గూడలోని శంకర కంటి ఆస్పత్రి వైద్య బృందం పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కంటి చూపు మందగించిన వారు, వృద్ధులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

◆ సబ్సిడీతో జీలుగ విత్తనాల పంపిణీ

కొడంగల్ రూరల్: 50శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు పట్టణంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసి తెలిపారు. బుధవారం నుంచి రైతులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కావాల్సిన వారు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకెళ్లాలని ఆమె తెలిపారు. క్వింటాల్ విత్తనాల ధర సబ్సిడీ పోను రూ.7,125లకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాలకు సరిపోయేవిధంగా 30కిలోల బ్యాగును ఇవ్వనున్నట్లు వివరించారు.

◆ బాధిత కుటుంబానికి పరామర్శ

యాలాల: మండలంలోని కిష్టాపూర్ మాజీ ఉపసర్పంచ్ పెండ్యాల రామయ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామయ్య మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్, నాయకులు అంజిలయ్య, వెంకటయ్య, శ్రీనివాస్, పెంటయ్య, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోటబాసుపల్లి గ్రామంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సాయిరెడ్డి భార్య నర్సమ్మ అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మంగళవారం కోటబాసుపల్లి గ్రామానికి వెళ్లి సాయిరెడ్డిని పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట సంపత్‌కుమార్, కరణం పురుషోత్తంరావు, సిద్రాల శ్రీనివాస్, వీరేందర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, నాగార్జున తదితరులు ఉన్నారు.

◆ జాబ్‌మేళాకు తరలిరండి

తాండూరు రూరల్: పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో 29వ తేదీ గురువారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు నిరుద్యోగులు తరలిరావాలని యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు జగదీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని నిరుద్యోగులు పెద్ద ఎత్తున జాబ్‌మేళాకు హాజరుకావాలని పేర్కొన్నారు.

◆ మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం

దుద్యాల్: దుద్యాల్, బొంరాస్‌పేట్ మండలాల్లో బుధవారం మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సాయినాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మిషన్ భగీరథ నీరు సరఫరా చేసే డీఐ ప్రధాన లైన్‌లో మరమ్మతులు, నిర్వహణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీకి సిద్ధం

సాక్షి ఎఫెక్ట్..

దుద్యాల్: మండలంలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేయడానికి అధికారులు సిద్ధం చేశారు. పలు గ్రామాలకు చెందిన రైతులు పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం గురించి పలు మార్లు అధికారులను కోరినా స్పందన కరువైంది. దీంతో ఈ నెల 26న సాక్షిలో పచ్చి రొట్ట విత్తనాల జాడేది అనే శీర్షికతో కథనం ప్రచురించారు. ప్రభుత్వం, వ్యవసాయ అధికార యంత్రాంగం స్పందించి మండలానికి 64.80 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు కేటాయించడంతో మండల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలను దుద్యాల్ మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచారని వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. సబ్సిడీ పోను 30 కిలోల బస్తాకు ధర రూ. 2,137.50లుగా నిర్ణయించారు. విత్తనాలు కావల్సిన వారు భూమి పాసుబుక్కు, ఆధార్ కార్డు జిరాక్స్‌తో సంప్రదించాలని కోరారు.



ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన జీలుగ విత్తనాలు

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న వెంకటయ్య

దుద్యాల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన దుద్యాల్ ప్రిమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. దుద్యాల్ గ్రామానికి చెందిన 11 స్ట్రైకర్స్ టీంకు ప్రథమ, 11 స్టార్స్ టీంకు ద్వితీయ బహుమతి అందజేశారు. విజేత జట్టుకు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య ట్రోఫీతో పాటు రూ.7వేలు, రెండో బహుమతి రూ.5వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయన్నారు. అనంతరం ఎంపైర్లుగా వ్యవహరించిన విష్ణవర్ధన్, నర్సిములును అభినందించారు. టోర్నమెంట్ నిర్వాహకులు నరేందర్, సంతోష్, నరేష్, శ్రీకాంత్, అనిల్, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ సత్యనారాయణ, జుమేదర్ యాదయ్య, ఇరు జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

పేదల కోసం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృషి

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్



వర్షానికి కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఆంజనేయులు తదితరులు

కుల్కచర్ల: పేదల కోసం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో అకాల వర్షాలకు పడగళ్ల వెంకటమ్మ ఇళ్లు కూలిపోవడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేద ప్రజల సమస్యల పరిష్కారంలో తోడుగా నిలుస్తాన్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, పెంటయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతోంది

చౌడాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌కుమార్



చౌడాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కుల్కచర్ల: వరి ధాన్యం సేకరణ ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం కొనసాగిస్తోందని చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వం వరి ధాన్యం సేకరించి నెలలు గడిచినా బిల్లులు ఇచ్చేవారు కాదని గుర్తు చేశారు. నేడు రైతుల ధాన్యం బిల్లు అయిన వెంటనే నగదును వారి ఖాతాల్లో నేరుగా జమచేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు దళారులు, రాజకీయ నాయకులు చెప్పే మాటలను నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్, సిబ్బంది మురళీ తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి సేవలు మరువలేనివి



కొడంగల్ రూరల్: వర్ధంతి వేడుకలో కమిటీ సభ్యులు

నవాబుపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం మాతా రమాబాయి అంబేడ్కర్ వర్ధంతిని అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఆనందం తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో రమాబాయి కమిటీ అధ్యక్షురాలు పి మల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘాల నాయకులు రమేష్‌బాబు, రమాబాయి కమిటీ సభ్యులు డి.వెంకటమ్మ పాల్గొన్నారు.



నవాబుపేట: మాతారమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

మిర్చి పంటల పరిశీలన

చేవెళ్ల: రైతులు వేసిన బజ్జీ మిర్చి పంటలను పరిశీలించి వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని మండల వ్యవసాయాధికారి శంకర్ లాల్, ఉద్యానశాఖ అధికారి కీర్తికృష్ణ అన్నారు. మండలంలోని చనువెల్లి గ్రామంలో బజ్జీ మిర్చి నారుతో మోసపోయామని రైతులు చేసిన ఫిర్యాదుతో మంగళవారం అధికారులు క్షేత్రపర్యటన చేసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు నారు తీసుకొచ్చిన నర్సరీల వివరాలను తెలుసుకున్నారు. చనువెల్లి, పామెన గ్రామాల్లో దాదాపు 40 మంది రైతులు 70 ఎకరాలకుపైగా బజ్జీ మిర్చి నారును ఖమ్మం జిల్లాలోని వైరాలో ఉన్న నర్సరీ ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపారు. రెండు నెలల కిత్రం కొనుగోలు చేసిన ఈ నారు వేసిన రైతులకు ఎవరికీ కూడా కాత పూత రాలేదని, దీనిపై నర్సరీ యజమానికి ఫోన్‌చేస్తే స్పందించటం లేదని వాపోయారు. ఇదే సమయంలో ఇతర నారు వేసిన రైతులకు మిర్చి కాత పూతలతో బాగున్నాయని అధికారులకు వివరించారు. పంటలను పరిశీలించిన అధికారులు పంట పెరిగింది కానీ కాత పూత లేకపోవటానికి గల కారణాలను ల్యాబ్‌లో పరిశీలించి తేల్చాల్సి ఉంటుందని, దీనిపై ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలిస్తారని స్పష్టం చేశారు. పంటల వివరాల నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. రైతులు లైసెన్స్ కలిగిన నర్సరీలలోనే నారు కొనుగోలు చేయాలని, కొనుగోలుకు సంబంధించి రశీదులను తప్పనిసరిగా తీసుకొని భద్రపర్చుకోవాలని సూచించారు. అప్పుడే ఏదైనా జరిగినా కూడా వారిని ప్రశ్నించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బాధిత రైతులు, గ్రామస్తులు ఉన్నారు.



చనువెల్లిలో పంటను పరిశీలిస్తున్న అధికారులు